మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఆలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాల వ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తీశ్వరాలయం, కాకతీయుల చారిత్రక దేవాలయాలు పాలంపేటలోని రామప్ప, గణపురంలోని కోటగుళ్లు, పలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో పూజారులు శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా జరిపించారు. ఉపవాస దీక్షతో పలు ఆలయాల్లో కీర్తనలు, భజనలు, హరికథలు వింటూ జాగారం చేశారు. పలువురి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- నమస్తే నెట్‌వర్క్


టేకుమట్ల : బూర్నపల్లి గట్టు మల్లన్న పట్నాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

చిట్యాల : ఒడితల రామలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

శివోహం..

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

కృష్ణకాలనీ : భూపాలపల్లి శివాలయంలో దీపాలు పెడుతున్న భక్తులు

వెంకటాపూర్ : పూజలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కాళేశ్వరం, రామప్ప, గణపేశ్వరాలయంలో భక్తుల సందడి
- ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం
- దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- ములుగు, జయశంకర్ జిల్లాల్లో ఘనంగా వేడుకలు

మల్హార్ మండలంలోని కొయ్యూరు మానేరు నది సమీపంలోని మహా లింగేశ్వరస్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహించగా మంత్రి శ్రీధర్‌బాబు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఛతురూప అయ్యప్ప సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు కుదురుపాక కృష్ణమాచార్యులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు దంపతులు, శ్రీ ఛతురూప అయ్యప్ప సహస్ర లింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు లట్ట రాజబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వెంకటాపురం మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివ కల్యాణం నిర్వహించారు. మహదేవపూర్ మండలకేంద్రంతో పాటు బొమ్మాపూర్, అంబటిపల్లిలోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణ ఘట్టాన్ని భక్తులు వీక్షించారు. చిట్యాల మండలం ఒడితల ర్రామలింగేశ్వర ఆలయం, జూకల్ శివాలయం, నవాబుపేట శివాలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ములుగు జిల్లా కేంద్రంతో పాటు జాకారంలోని కాకతీయుల కాలం నాటి శివాలయం, జిల్లా కేంద్రంలోని నగరేశ్వరస్వామి ఆలయం, పత్తిపల్లి శివారులో ఉన్న బుగ్గరామన్న ఆలయంతో పాటు పలు గ్రామాల్లో భక్తులు పూజలు చేశారు. ములుగులో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కాటారం మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి, అయ్యప్ప స్వామి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టేకుమట్ల మండలంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణారావు-పద్మ దంపతులు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఎంపీపీ మల్లారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మొగుళ్లపల్లి మండలం పర్లపల్లిలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో నిర్వహించిన శివ కల్యాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గణపురం మండల కేంద్రం కోటగుళ్లలో దేవాలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, కళాకారులతో రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పేరిణి నృత్యం, కోయ డాన్సులు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే సత్యనారాయణరావు-పద్మ దంపతులు, హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీ సాయి చైతన్య, కీర్తి దంపతులు పాల్గొన్నారు. మంగపేటలోని ఉమాచంద్రశేఖరస్వామి, మల్లూరు శంభులింగేశ్వర, రాజుపేట కొండలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు, పలు ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రామప్పలో..

వెంకటాపూర్: మండలంలోని రామప్ప దేవాలయం శుక్రవారం శివరాత్రి సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నాలుగు గంటల నుంచి భక్తుల వేల సంఖ్యలో సందర్శించి శ్రీరామలింగేశ్వరస్వామికి అభిషేకాలు చేశారు. అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి దీపాలను వెలిగించారు. రాత్రి జాగరణకు మరో 50 వేల మంది హాజరయ్యారు.

సందర్శించిన ప్రముఖులు

రామప్ప ఆలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అర్చకులు అందించి, స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు. డీఈవో పాణిని, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, ఎంపీపీ బుర్ర రజితా సమ్మయ్య, జడ్పీటీసీ రుద్రమదేవి, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సైలు చల్ల రాజు, తాజుద్దీన్, టూరిజం అధికారులు, ప్రజాప్రతినిధులు, సందర్శించారు. ముస్లిం కుటుంబం రామప్పను సందర్శించి రామలింగేశ్వరుడికి అభిషేకాలు నిర్వహించడం గమనార్హం. రామప్ప గార్డెన్‌లో భక్తుల సౌకర్యార్థం ల యన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తాగు నీరందించారు. ఈవో శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీహెచ్‌వో సదానందం, 108 సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ఎస్పీ శబరీష్ ఆధ్వర్యంలో డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు, పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు.

కాటారం(మల్హార్) : పూజలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం

ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో శివపార్వతుల కల్యాణాన్ని వేదపండితులు, ఆలయ అర్చకులు జరిపించారు. ఈ ఘట్టాన్ని తిలకించడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు.

కాళేశ్వర దేవస్థానంలో..

కాళేశ్వరం : శివనామస్మరణతో కాళేశ్వరం దేవస్థానం మార్మోగింది. త్రివేణి సంగమ గోదావరి నది భక్త జనులతో పులకించిపోయింది. శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకోవడంతో కాళేశ్వరం జాతరను తలపించింది. ఆలయ పండితులు శివ పార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. మంత్రి శ్రీధర్ బాబు స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకురాగా, ఎంపీపీ రాణిబాయి, ఎంపీటీసీ మమత, ధర్మకర్తలు ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చి ఉత్సవమూర్తులకు సమర్పించారు. రాత్రి ఆలయ ఆవరణలో హరికథ చెప్పారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలిరాగా, పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. శివరాత్రిని పురస్కరించుకొని కాళేశ్వరానికి శుక్రవారం 2.20 లక్షలకు పైగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి సైకత లింగాలకు మహిళలు పసుపు, కుంకుమలతో పూజించారు. అనంతరం ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయంలో పూజలు చేసిన ప్రముఖులు

కాళేశ్వరంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ కిరణ్ కారె ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఈవో మారుతి ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అలాగే కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మహారాష్ట్రకు చెందిన పోలీస్ అధికారులు కుటుంబ సమేతంగా స్వామి వార్లను దర్శించుకున్నారు.

ఏటూరునాగారం రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సీతక్క


మంగపేట : శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మొగుళ్లపల్లిలో..

గణపురం: కోటగుళ్లలో పూజలు చేస్తున్న భక్తులు

కాళేశ్వరం ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

రామప్ప ఆలయంలో నృత్యం చేస్తున్న కళాకారులు

వెంకటాపూర్ : రామలింగేశ్వరుడి దర్శనానికి క్యూలో భక్తులు

కలెక్టరేట్ పనుల్లో వేగం పెంచాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగురూరల్, మార్చి 8 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆమె పనులను పరిశీలించి మాట్లాడారు. ఈ ఏడాది లోపు నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించుకోవాలన్నారు. ఇందుకు సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.


కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

బాలకుమారస్వామికి మంత్రి మొక్కులు

ములుగు మండలం అంకన్నగూడెం గ్రామంలో జరుగుతున్న బాలకుమారస్వామికి మంత్రి సీతక్క మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పూర్వీకుల ద్వారా వచ్చిన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాల వారు కాపాడుకోవాలని అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అందులో భాగంగా రూ.34కోట్లతో జంగాలపల్లి నుంచి జగ్గన్నగూడెం వరకు డబుల్‌రోడ్ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

ఏటూరునాగారం శివాలయంలో మంత్రి సీతక్క పూజలు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నూతన చైర్మన్ మడుగూరి ప్రసాద్‌ను ఏర్పాట్లపై తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ఆకులవారి ఘనపూర్‌లో రూ. 20లక్షలతో చేపట్టే డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మంత్రిని సన్మానించారు. అంబేద్కర్ నగర్‌లోని మల్లికార్జునస్వామి ఆలయంలో పాల్గొని పూజలు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు చిటమట రఘు, ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, గుడ్ల దేవేందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం

మాట్లాడుతున్న జిల్లా ఐద్వా అధ్యక్షురాలు బచ్చల సౌమ్య

వాజేడు, మార్చి 8 : మహిళలపై దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని జిల్లా ఐద్వా అధ్యక్షురాలు బచ్చల సౌమ్య అన్నారు. మండలంలోని ఐటీఐ సమీపంలోని గుడిసెల కేంద్రం వద్ద శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా నేటికీ మహిళలు, చిన్న పిల్లలపై లైంగిక దాడులు పెరిగాయే తప్పా ప్రభుత్వాలు అరికట్టడంలేదని విమర్శించారు. మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు తెచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుర్సం నాగలక్ష్మి, హైమావతి, యశోద, నవీన, శాంత, రామలక్ష్మి, అనూష, ప్రమీళ, శారద, తిరుపతమ్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన కేంద్ర మంత్రి

ప్రసాద్ పథకంలో జరుగుతున్న పనుల పరిశీలన

పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

వెంకటాపూర్, మార్చి 8 : రామప్ప దేవాలయాన్ని శుక్రవారం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభ స్వాగతం పలికి రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. శాలువాలతో సన్మానించి, వేదమంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ప్రసాద్ పథకంలో భాగంగా రూ.62 కోట్లతో పాలంపేట గ్రామంలో నిర్మిస్తున్న సైట్ ఏలోని ఫుడ్‌కోర్టు, సావనీర్ స్టాల్స్, టాయిలెట్ బ్లాక్, ప్రహరీ, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. దీంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆయన వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఆర్కీయాలజీ సూపరింటెండెంట్ స్మిత ఎస్.కుమారి, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, పురావస్తు శాఖ ఏఈ కృష్ణ చైతన్య, సీఏ మల్లేశ్, గార్డెన్ ఫోర్‌మెన్ ప్రదీప్‌బాబు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, ఏఈ విజయ్ కుమార్, టూరిజం అధికారులు ఉన్నారు.

వాజేడు ఏజెన్సీలో మావోయిస్టు కరపత్రాలు

వాజేడు, మార్చి 8 : వాజేడు ఏజెన్సీ ప్రగళ్లపల్లి గ్రామ శివారు వాజేడు-వెంకటాపురం ప్రధాన రహదారి పక్కన శుక్రవారం మావోయిస్టు కరపత్రాలు వెలిశాయి. అలాగే మొరుమురు కాలనీ, మొరుమురు ప్రధాన రహదారి పక్కన కరపత్రం లోపల టార్చిలైట్ వైరు పెట్టి ఉండడంతో అటుగా వెళ్లేవారు చూసి ప్రెషర్ బాంబులాంటిది పెట్టి ఉంటారనే సందేహంతో భయందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం సీఐ బండారు కుమార్, ఎస్సైలు చవాళ్ల వెంకటేశ్వర్‌రావు, కొప్పుల తిరుపతిరావు బాంబ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. బాంబు లేదని, భయపెట్టేందుకే టార్చిలైట్ వైరును అమర్చినట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగురూరల్, మార్చి 8 : ములుగు మండలం మల్లంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లంపల్లి, పందికుంట గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా మహిళా దినోత్సవం

వెంకటాపురం(నూగూరు), మార్చి 8 : మండలంలో శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలో కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలను శాలువాతో సన్మానించారు. అంతకుముందు మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిడెం రవికుమార్, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు రాజు పాల్గొన్నారు.

పదో తరగతి హాల్ టికెట్లు విడుదల

భూపాలపల్లి డీఈవో రాంకుమార్

భూపాలపల్లి రూరల్, మార్చి 8: జిల్లాలో మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నందున హాల్ టికెట్లు విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 117 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 3,547 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ సారి ఫిజికల్ సైన్స్, బయాలజీ పరీక్షలు వేర్వేరుగా జరుగుతాయన్నారు. హాల్ టికెట్లను విద్యార్థులు నేరుగా bse.telangana.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వారు తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

రేగొండ,(గోరికోత్తపల్లి) మార్చి 8 : మండలంలోని వెంకటేశ్వర్లుపల్లె గ్రామానికి చెందిన బీస సమ్మక్క (58) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రెండేళ్ల క్రితం సమ్మక్కకు పక్షవాతం వచ్చింది. ఆసుపత్రులకు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై శుక్రవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించే క్రమంలో మృతి చెందింది. మృతురాలి భర్త సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భూపాలపల్లి ఎస్సైగా హరిశంకర్

భూపాలపల్లి రూరల్, మార్చి 8: భూపాలపల్లి ఎస్సైగా జీ హరిశంకర్‌ను నియమిస్తూ శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో భాగంగా రామగుండం ఎస్సైని భూపాలపల్లికి, ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ శ్రవణ్‌కుమార్‌ను సుల్తానాబాద్‌కు బదిలీ చేశారు.

కాటారం పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

కాటారం, మార్చి 8: కాటారం పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసాన్ని నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినట్లు చైర్మన్ చల్ల నారాయణరెడ్డి తెలిపారు. కాగా, డైరెక్టర్ల అవిశ్వాస తీర్మానంతో బల నిరూపణకు డీసీవో ఈనెల 11న సమావేశం నిర్వహించేందుకు నోటీసులు జారీ చేశారు. నారాయణరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేయగా కోర్టు తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. దీంతో ఈనెల 11న జరుగాల్సి సమావేశం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు చెప్పారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఏటూరునాగారం, మార్చి 8 : రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతుగా సహకారం అందిస్తామని ఆవోపా(ఆర్యవైశ్య ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మడుగూరి నాగేశ్వర్‌రావు అన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మడుగూరి ప్రసాద్, డైరెక్టర్లను ఆవోపా ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈసందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ గొప్ప బాధ్యతగా కమిటీ భావించి ఆలయం అభివృద్ధికి పాటు పడాలని కోరారు. కొత్త కమిటీ ఏర్పాటుకు చొరవ చూపిన మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఆవోపా యూనిట్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు బచ్చు సతీశ్, బచ్చు సత్యనారాయణ, బొలసాని గౌరీశంకర్, గంజి రమేశ్, గుంత రమేశ్, గంజి సాంబశివరావు, మడుగూరి శ్రీనువాస్, వెలగందుల మాధవ్, సిరిపురం చందు పాల్గొన్నారు.

మడుగూరి ప్రసాద్, సభ్యులను సన్మానిస్తున్న ఆవోపా కమిటీ ప్రతినిధులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

VEHICLES FOR SALE

★AP36AT7382 Hymath Mohammad MARUTHI DZIRE Tour Diesel 5 Seater 2012, TS04EB-1575 SD Kalam MARUTHI SWIFT VDI Diesel 5 Seater 2014, గమనిక: ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును. Auction Date: 09-03-2024, Venue: Shriram Auto Mall India Ltd., Warangal. Cont: Shriram Finance Limited, D.No. 24-7-29, 1st Floor, Fathima Complex, Kazipet. 9989809938, 9989313186.
NTW-14028

HMDA & RERA PLOTS

★3-5 సంవత్సరాలలో Future City భువనగిరిలో 200 ఎ॥ AIIMS హాస్పిటల్ దగ్గర్లో HMDA & RERA ప్లాట్లు 60% లోన్‌తో గేటెడ్ కమ్యూనిటీలో కలవు: 8109994456.
NT-320386

CHANGE OF NAME

I, YAKHOOBUNNISA BEGUM, W/o. TAHER HUSSAIN (New Name), previously called YAKHOOBUNNISA (Old Name), R/o. H.No. 16-11-382, Chintal, K.M. College, Warangal Dist-506007, T.S., India. solemnly declare.

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565